

# నవభూమి

## నల్లగొండ

అనుబంధం

09 ఏప్రిల్,2025 బుధవారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


### తిరుమలగిరి సాగర్ మండలంలో 4, 000ఎకరాలు

# 4,500మందికి పట్టాలు

◆ ఎమ్మెల్యే జయవీర్ అధ్యక్షతన అసైన్మెంట్ కమిటీ ఆమోదం



**మిర్యాలగూడ నవభూమి, ఏప్రిల్ 8:-** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తిరుమలగిరి సాగర్ మండలంను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా తిరుమలగిరి సాగర్ మండలంలో గల గ్రామాలలో రెవెన్యూ, సర్వే సిబ్బంది ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూములను ఎంజాయ్ మెంట్ సర్వే చేశారు.ఎంజాయ్ మెంట్ సర్వే చేసి గ్రామాల వారీగా అర్హులను గుర్తించారు.అర్హులకు అసైన్ మెంట్ పట్టాలు జారీ చేయాలని సదుద్దేశంతో మిర్యాలగూడ సబ్ కలెక్టరేట్ లో మంగళవారం అసైన్మెంట్ కమిటీ సమావేశం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే, కమిటీ చైర్మన్ కుందూరు జయవీర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.కమిటీలో భాగంగా నేడు అసైన్ మెంట్ కమిటీ చైర్మన్ జయవీర్రెడ్డి, కన్వీనర్, సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్, సభ్యులు, ప్రాజెక్టు డైరెక్టర్ డిఆర్డిఎ వై.శేఖర్ రెడ్డి హాజరయ్యారు.అసైన్ మెంట్ కమిటీలో తిరుమలగిరి సాగర్ మండలంలోని 13 గ్రామాలకు సంబంధించి ప్రభుత్వ భూములలో కాస్తు ఖబ్జాలో ఉండి సేద్యం చేస్తు అర్హత కలిగిన సుమారు 4,500 మందికి సుమారు 4,000 ఎకరాలకు లావుని పట్టాలు జారీ చేయుటకు గాను ఆమోదించారు. త్వరలో అర్హులకు అసైన్ మెంట్



పట్టాలు జారీ చేయడం జరుగుతుందనీ జయవీర్ రెడ్డి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇంతవరకు ధరణిలో నమోదు కానటువంటి పరేడ్, ఉడాఫా నెంబర్లను కూడా గుర్తించి ఆన్ లైన్ కి తీసుకురావడం జరిగిందని సబ్ కలెక్టర్ అమిత్ తెలిపారు.సమావేశంలో తిరుమలగిరి సాగర్ మండల తహశీల్దార్ పైలట్ ప్రాజెక్ట్ టీం లీడర్లు, డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

### వక్ఫ్ మార్చ్‌ను

# విజయవంతం చేయాలి






### ప్రభుత్వాలు చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్న

# మాటలకే పరిమితమైనాయి

◆ యాసంగి సీజన్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు సిండికేట్‌గా

◆ మారుతున్నట్లు అనిపిస్తుంది:సిపిఎం మండల కార్యదర్శి యాకోబ్



**గరిడేపల్లి నవభూమి:** పొనుగోడు గ్రామములో వడ్ల రాశులను పరిశీలించిన సిపిఎం మండల కార్యదర్శి ఎస్కె కె యాకూబ్ యాసంగి సీజన్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు సిండికేట్ గా మారుతున్నట్లు అనిపిస్తుందని సిపిఎం మండల కార్యదర్శి యాకూబ్ అన్నారు ప్రభుత్వాలు చివరి గింజ వారికి కొనుగోలు చేస్తాం మాటలకే పరిమితమైనారని అన్నారు ఒకటి రెండు రోజులు మాత్రమే 200600 తీసుకొని తర్వాత 200200 250 ఇలా ఎందుకు జరుగుతుంది అని అడిగే నాధుడు లేకపోయాడని యాకుబ్ అన్న గత మూడు రోజులుగా రైతులు ధాన్యం తీసుకుపోయి మిల్లుల వద్ద పడిగాబులు కావలసిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు తేమశాతం ఆశీర్వదించిన విధంగా లేదని సాకులు చూపి రోజు రోజుకి ధరల్లో కోతలు పెడుతున్నారని రవాణా ఖర్చులు కూడా తామే భరించవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు తీరా మిల్లు దగ్గరకొచ్చిన ధాన్యం ఇంటికి తీసుకుపోలేక రైతులు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. ముందుగా పంట వేసిన రైతులు ఉగాది తర్వాత కోతలు మొదలుపెట్టి ధాన్యం చేతికి రాగానే నెలకు అమ్మకాలు మొదలుపెట్టి ధరలు ఎక్కువగా ఉండటం వలన ఆధారపడ్డారు ఇదే సాకుగా భావించిన మిల్లర్లు రైతులని దూకుడు చేస్తున్నట్లు కనిపిస్తుందని యాకుబ్ అన్నారు వెంటనే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోనీ సన్నగుడ్లని మూడు వేల రూపాయల క్వింటాలు వచ్చేటట్లుగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో నందిపాటి మట్టయ్య మండల సైదులు ఎస్కే మల్సూర్ చామకూరి వెంకటప్పయ్య నర్సిరెడ్డి చిన్న వెంకన్న శేఖర్ మల్లయ్య శ్రీను రాములు పుల్లయ్య వీరస్వామి రాములు వెంకట్ నరసయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

### 11 నుంచి 14 వరకు ఎంజీయూలో

# మహనీయుల జయంతి ఉత్సవాలు



# 12న వీరహనుమాన్ విజయాత్ర జయప్రదం చేయాలి

## బ్యానర్ల ఆవిష్కరణలో నేతలు



**మిర్యాలగూడ నవభూమి, ఏప్రిల్ 8:-** మిర్యాలగూడ పట్టణంలో ఈ నెల12 శనివారం సాయంత్రం 4 గంటలకు వీర హనుమాన్ విజయ యాత్ర కార్యక్రమం విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో జరుగుతుందనీ విజయవంతం చేయాలని స్థానిక శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో కార్యకర్తల సమావేశంలో బ్యానర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంజి సుధాకర్ నల్గొండ విభాగ్ కార్యదర్శి గార్లపాటి ఉమాకర్ రెడ్డి నల్లగొండ జిల్లా అధ్యక్షులు తల్లం వెంకన్న, కోశాధికారి, రాపర్తి శ్రీనివాస్, సత్సంగ ప్రముఖ్ నాంపల్లి రాంకుమార్ నగర కార్యదర్శి నాగయ్య సహ కారదర్శి ,మురళీకృష్ణ ఉపాధ్యక్షులు గంజి మురళి సంఘటన ప్రముఖ్ సత్యనారాయణ సహా సంఘటన ప్రముఖ సాయిలుయాదవ్ దేవాలయ కమిటీ అధ్యక్షుడు బాక్సింగ్ రవీందర్, కార్యదర్శి వెంకటాచార్యులు పూజారి, సైదులు, గోవర్ధన్ లు పాల్గొన్నారు.

# రామచంద్ర బాబు కుటుంబాన్ని పరామర్శించిన పైడాకుల అశోక్



**మంగపేట, ఏప్రిల్ 08(నవభూమి):**మంగపేట మండలం చెరుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెరుపల్లి మాజీ సర్పంచ్ జనగాం రామచంద్ర బాబు మాతృమూర్తి సరోజన సోమవారం రోజున స్వర్గస్తులవ్వగా వారి స్వగృహం కు వచ్చి వారి కుటుంబ సభ్యులను ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పరామర్శించారు. ఈ కార్యక్రమం లోమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి తో పాటు జిల్లా, నియోజకవర్గ, బ్లాక్ కాంగ్రెస్, మండల సీనియర్ నాయకులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి ఏప్రిల్ 08** గర్భిణీ స్త్రీలు బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారానే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి దోహదపడతారని భువనగిరి సిడిపిఓ శైలజ తెలిపారు. పురపాలక కేంద్రంలో మహమ్మాయి కాలనీలోని అంగనవాడి కేంద్రంలో పురపాలక కేంద్రంలో మహమ్మాయి కాలనీలోని అంగనవాడి కేంద్రంలో పోషక అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పోషకాహనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల కు పోషకాహారం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణీ స్త్రీల కాన్పుల సమయంలో ఆపరేషన్లు కాకుండా సుఖ ప్రసవాలు అయ్యే విధంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పద్మ ,అంగన్వాడీ టీచర్ పారిజాత, శివరాణి, తదితరులు పాల్గొన్నారు.



### వక్ఫ్ చట్ట సవరణకు నిరసనగా 13న ట్యాంక్ బండ్‌పై జరిగే

# వక్ఫ్ మార్చ్‌ను విజయవంతం చేయాలి

◆ కాంగ్రెస్‌మైనార్టీ విభాగం వైస్‌చైర్మన్ ఖాలీద్ సైఫుల్లాహ్

**మిర్యాలగూడ నవభూమి ఏప్రిల్ 8:-** వక్ఫ్ చట్ట సవరణకు నిరసనగా ఈనెల 13న హైదరాబాదు ట్యాంక్ బండ్ పై జరిగే వక్ఫ్ మార్చ్ ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ ఖాలీద్ సైఫుల్లాహ్ కోరారు మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయం రాజీవ్ భవన్ లో వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడాలని, కేంద్రం తెచ్చిన వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకరిస్తూ ప్ల కార్డులను ప్రదర్శించారు. అంతకముందు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరించిందని ఆరోపించారు. దేశంలో మెజార్టీ ప్రజలు ఈ చట్టసవరణను వ్యతిరేకిస్తున్న పార్లమెంట్లో తమకు మెజార్టీ ఉందని బిల్లును పాస్ చేసుకున్నారని విమర్శించారు బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చివరి వరకు పోరాటం చేసిందని మెజార్టీ లేకపోవడంతో బిల్లు పాసయిందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నామని తెలిపారు. బిల్లు రద్దు కోసం న్యాయస్థానం ద్వారా న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. ముస్లిం మైనార్టీల అభిప్రాయాలు తెలుసుకోకుండానే బిల్లు పాస్ చేసుకున్నారని దీనిపై మెజార్టీ హిందువులు కూడా వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం కావాలని ముస్లింలకు సంబంధించిన ఆస్తులను కాజేసేందుకు కుట్ర పన్నినదని ఆరోపించారు. వక్ఫ్ బిల్లు అందరి సమస్యని దీనిపై కుల మతాలకతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బిల్లు అమలు కాకుండా పోరాటాల ద్వారా అడ్డుకుంటామని హెచ్చరించారు. బిల్లుకు వ్యతిరేకంగా ఈనెల 13న హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై పెద్ద ఎత్తున వక్ఫ్ మార్చ్ నిర్వహిస్తున్నామని రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. నల్గొండ జిల్లా నుండి పెద్ద ఎత్తున ముస్లింలు తరలిరావాలని ముఖ్యంగా మిర్యాలగూడ నియోజవర్గం నుండి ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి మార్చ్ ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో






మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సిరాజుద్దీన్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.సలీం, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షులు ఎం ఏ అరిఫ్, ఐఎన్టియుసి పట్టణ అధ్యక్షుడు చాంద్ పాషా, సల్మాన్, జానీ, ఎంఎ.సమీఖాద్రీ, ఎండి.మోహ్సిన్ పాల్గొన్నారు.

### 11 నుంచి 14 వరకు ఎంజీయూలో

# మహనీయుల జయంతి ఉత్సవాలు

**నల్లగొండ నవభూమి, :** మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, భారత ఉప రాష్ట్రపతి బాబు జగ్జీవన్ రామ్ అడుగు జాడల్లో విద్యార్థులు ముందుకు సాగాలని ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం వర్సిటీలోని తన ఛాంబర్ లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అలవాల రవితో కలిసి యూనివర్సిటీ స్టాఫ్ అండ్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలోనే నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యూనివర్సిటీలో ఈనెల 11 నుంచి 14 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులంతా ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమాల నిర్వహణ..11న ఉదయం 6 గంటలకు 5కే రన్. నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో గల మహాత్మా పూలే విగ్రహం నుంచి చర్లపల్లి బైపాస్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు. అదేవిధంగా మధ్యాహ్నం వ్యాసరచన, వకృత్వ, షార్ట్ ఫిలిం, డాన్స్ పోటీలు.12వ తేదీ మధ్యాహ్నం రంగోలి, క్విజ్, పెయింటింగ్, ఫేస్ పెయింటింగ్ పోటీలు. అదేవిధంగా కెరియర్ గైడెన్స్ పై అవగాహన సదస్సులు.13వ తేదీ మధ్యాహ్నం పద్యం, పాటలు ఇతర అంశాలపై పోటీలు, అలాగే సోషల్ జస్టిస్ ఇన్ 21 సెంచరీపై సదస్సు (సింపోసియం) 14వ తేదీన సామాజిక పరివర్తనలో విశ్వవిద్యాలయ పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహణ.కార్యక్రమాల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నంబర్లలో 9885939289,



9490807300 సంప్రదించవచ్చు. లేదా యూనివర్సిటీ పని వేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు నిర్వహణ కమిటీ సభ్యులను స్వయంగా కలిసి వివరాలు తెలుసుకోవచ్చు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో ఉత్సవాల చైర్మన్ యూనివర్సిటీ సోషల్ సైన్ డిపార్ట్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి, స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ డాక్టర్ హరీశ్‌కుమార్, యూనివర్సిటీ కాంపిటేటివ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ శ్రవణ్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ కె.శ్రీదేవి, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ, సుధారాణి, ప్రేమ్‌సాగర్, సబీనా హెరాల్డ్, సైన్స్ కళాశాల ప్రొఫెసర్ ఎం.వసంత పాల్గొన్నారు.

# నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

**కట్టంగూర్, నవభూమి, :** మండల పరిషత్ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని నల్లగొండ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు అన్నారు. వార్షిక పరిశీలనలో భాగంగా మంగళవారం కట్టంగూర్ ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ప్రాణాళికయుతంగా ఖర్చు చేయాలన్నారు. ఖర్చుల వివరాలను రికార్డుల రూపంలో నమోదు చేయడంతో పాటు గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.మురుగు కాల్వలు, మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలన్నారు. సమయ పాలన పాటించాలని అధికారులకు, కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాష్ రావు, ఇన్‌చార్జి ఎంపీఓ చింతమల చలపతి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



## పోషణ పక్షం కార్యక్రమానికి సహకరించాలి

### ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ మమత




**మిర్యాలగూడ నవభూమి, ఏప్రిల్ 8:-** ఏప్రిల్ 8 నుండి 22 వరకు నిర్వహించబడుతున్న పోషణ పక్షం కార్యక్రమానికి మున్సిపల్ పరిధిలో సహకరించాలని మిర్యాలగూడ అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పీఓ రేఖల మమత కోరారు. మంగళవారం మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ సమక్షంలో మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో లైన్ డిపార్ట్మెంట్ అధికారులందరితో కలిసి కన్వర్జెన్సీ మీటింగ్ నిర్వహించారు. పోషణ అభియాన్ కార్యక్రమాలు, పిల్లల యొక్క పోషణ స్థాయిలో వయసుకు తగ్గ ఎత్తు, వయసుకు తగ్గ బరువు, ఎత్తుకు తగ్గ బరువులకు సంబంధించిన ఇండికేటర్స్ ను వివరించారు. మునిసిపల్ పరిధిలోని మెప్మా రిసోర్స్ పర్సన్స్, స్వయం సహాయక సంఘాలను కార్యక్రమం విజయవంతానికి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో డిఇఇ వెంకన్న, ఆర్ఓ జి.జ్ఞానేశ్వరి, టీపీఎస్ అంజయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్లు వెంకటరమణ, ఎండి. జాఫర్, కిరణ్, వార్డు ఆఫీసర్లు, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు పద్మావతి, నజ్మా, బ్లాక్ కో ఆర్డినేటర్ కవితలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

### తసిల్దార్ బండ కవిత




**గరిడేపల్లి నవభూమి** ఈరోజు గరిడేపల్లి మండల కేంద్రంలో ఉన్న సర్వారం సహకార సంఘం నందు పి పిసి సెంటర్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రంను ఈరోజు మండల పరిధిలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు నందు మండల తహసీల్దార్ బండ కవిత పి ఐ సి.చైర్మన్ జె కమలా తో కలిసి ప్రారంభించారు సర్వార సహకార సంఘం పరిధిలో ఉన్న రైతులందరూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏ గ్రేడ్ ధాన్యం 2320 రూపాయలు బి గ్రేడ్ ధాన్యం 2300 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలను సంఘ పరిధిలో ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ప్రవీణ్ వ్యవసాయ శాఖ ఏఈఓ త్రివేణి సంఘ కార్యదర్శి తవిడ బోయిన గోపయ్య సంఘ సిబ్బంది యడవెల్లి వెంకటేశ్వర్లు ఉల్లెందుల సతీష్ సందీప్ రైతులు అప్పి రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## కిష్టాపురం వరకు బ్రాహ్మణ వెల్లంల

# లెఫ్ట్ మెయిన్ కెనాల్ పొడిగింపు



**మునుగోడు, నవభూమి, :** ప్రస్తుతం చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామం వరకే ఉన్న బ్రాహ్మణ వెల్లంల లెఫ్ట్ మెయిన్ కెనాల్‌ను మునుగోడు మండలం కిష్టాపురం వరకు 11.5 కిలోమీటర్ల పొడిగించనున్నట్లు ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ ఇంజినీర్లతో ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని తన నివాసంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెనాల్ విస్తరణతో మునుగోడు మండలంలో 25 వేల ఎకరాల ఆయకట్టును పెంచే దిశగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు.బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ నుండి మునుగోడు మండలంలోని భూములను సస్యశ్యామలం చేసే దిశగా అడుగులు ముందుకు పడుతున్నట్లు తెలిపారు. మునుగోడు మండలంలో వీలైనంత ఆయకట్టుకు నీటిని అందించే విధంగా అంచనాలు రెడీ చేసి పనులు మొదలుపెట్టాలని ఇంజినీర్లకు సూచించారు. భవిష్యత్‌లో అవసరం అయితే కిష్టాపురం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చుకుని అక్కడినుండి ఎగువ ప్రాంతానికి లిఫ్టల ద్వారా నీరందించాలన్నారు. కిష్టాపురం వరకు వచ్చే మెయిన్ కెనాల్‌తో పాటు కిష్టాపురం తర్వాత ఎంతవరకు వెసులుబాటు ఉంటే అంతవరకు డిస్ట్రిబ్యూషన్ కాల్వలు తవ్వడానికి కావాల్సిన సర్వే, భూసేకరణ పనులు వెంటనే మొదలు పెట్టాలన్నారు.బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్ట్‌లో సరిపడా నీరు ఉండేలా పానగల్లు ఉదయ సముద్రం నుండి నీటిని తీసుకుని వచ్చే వానకాలం పంటలకు రెడీగా ఉండాలన్నారు. భవిష్యత్‌లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తయిన తర్వాత కృష్ణా నీటిని సమృద్ధిగా వాడుకోవడానికి పానగల్లు ఉదయ సముద్రం, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ కెపాసిటీ పెంచుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కావునా బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ నుండి మునుగోడు మండలంలో ఆయకట్టును సాధ్యమైనంతవరకు పెంచే విధంగా పనులు వెంటనే మొదలు పెట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ విఠలేశ్వర్, ఏఈఈ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

# ఏపీ నుంచి జిల్లాకు అక్రమంగా ధాన్యం

**మిర్యాలగూడ-నవభూమి** నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతంలో యాసంగి సీజన్ వరి కోతలు ముమ్మరంగా నడుస్తున్నాయి. కాగా, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుంచి ధాన్యం లారీలు మిర్యాలగూడ ప్రాంతానికి జోరుగా వస్తున్నాయి. దీంతో జిల్లా రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లర్లు అనేక కొర్రీలు పెడుతున్నారు. ఏపీ రైతులు అతి తక్కువ ధరకే ఇక్కడి మిల్లులకు ధాన్యం రవాణా చేస్తుండడంతో జిల్లా రైతులు పండించిన ధాన్యాన్ని ఇంకా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఉమ్మడి జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.గతంలో బయటి ధాన్యాన్ని అడ్డుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో నల్లగొండ జిల్లా రైతులు పండించిన ధాన్యానికి వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని తెలిసిన వెంటనే బీఆర్ఎస్ ప్రభుత్వం బార్డర్ చెక్‌పోస్టుల వద్ద టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి ధాన్యం అక్రమ రవాణాను అడ్డుకున్నది. దాంతో జిల్లా రైతాంగానికి మద్దతుకు మించి ధర లభించింది. ప్రస్తుతం యాసంగి సీజన్ వరి కోతలు ప్రారంభమై 20రోజులు అవుతున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. రైతులకు సరైన ధర అందుతుందా.. లేదా? అనే విషయంపై ఎవరూ దృష్టి సారించడం లేదు. దాంతో మిర్యాలగూడ పరిసర ప్రాంతాల రైస్ మిల్లులకు వాడపల్లి, రామాపురం, నాగార్జునసాగర్ చెక్‌పోస్టుల నుంచి దర్జాగా ఏపీలోని సన్న ధాన్యాన్ని తీసుకొస్తున్నారు.తక్కువ ధరకే ఆంధ్రా ధాన్యం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బార్డర్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయకపోవడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి నల్లగొండ జిల్లాకు ధాన్యం జోరుగా వస్తుంది. అక్కడి రైతులు క్వింటా రూ.2వేలకే మిల్లు వద్దకు రవాణా చేస్తున్నారు. దాంతో జిల్లా రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి పచ్చి గింజ ఉంది.. ధాన్యం డ్రై అయ్యింది అని మిల్లర్లు సాకులు చెబుతూ ధరలో కోత విధిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320 ఉండగా, వ్యాపారులు రూ.2100 నుంచి రూ.2200 వరకే కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి లారీల ద్వారా అధికంగా ధాన్యం రవాణా కావడం వల్లే ఇక్కడ పండించిన ధాన్యానికి కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని జిల్లా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రం నుంచి ధాన్యం రవాణాను అడ్డుకొని మన ధాన్యానికి మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా రైతులు కోరుతున్నారు.ధాన్యం కొనకుండా ఇబ్బందులు పెడుతున్నారు నేను నాలుగెకరాల్లో పండించిన సన్న ధాన్యాన్ని మిర్యాలగూడకు తీసుకొచ్చాను. 15 మిల్లులు తిరిగినా ఎవరూ కొనుగోలు చేయలేదు. చివరికి తక్కు వ ధరకు క్వింటా 2,150 రూపాయలకే అమ్మాల్సి వచ్చిం ది. బయటి రాష్ట్రాల నుంచి ధాన్యం లారీలు రావడం వల్లే ఇక్కడి రైతులకు మద్దతు ధర పెట్టడం లేదు. గత ప్రభుత్వం బార్డర్ చెక్‌పోస్టుల వద్ద టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను పెట్టి బయటి ధాన్యం రాకుండా చర్యలు చేపట్టింది. దానివల్ల ఇక్కడ రైతులకు మద్దతు ధర దక్కింది. ఇప్పుడు బార్డర్ చెక్‌పోస్టుల వద్ద అడ్డంకులు లేకపోవడంతో బయటి రాష్ట్రాల నుంచి ధాన్యం జోరుగా వస్తుంది. ప్రభుత్వం స్పందించి బయటి రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని అడ్డుకొని స్థానిక రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి.ఎల్.నాగేశ్వర్‌రావు, రైతు, దామరచర్ల మనకు మద్దతు ధర ఇవ్వడం లేదు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పండించిన ధాన్యాన్ని అక్కడి రైతులు లారీల ద్వారా తక్కువ ధరకే మిర్యాలగూడ రైస్ మిల్లులకు రవాణా చేస్తున్నారు. దీని వల్ల నల్లగొండ జిల్లాలో సన్న ధాన్యం పండించిన రైతులకు మిల్లర్లు మద్దతు ధర ఇవ్వకుండా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. 15రోజుల క్రితం క్వింటా రూ.2500 అమ్మితే.. ఇప్పుడు రూ.2200లోపే కొనుగోలు చేసి రైతులను దోచుకుంటున్నారు. తక్కువ ధర ఉండడంతో వరి కోతలు ఆపేసిన. ధర పెరుగుతదని వేచిచూస్తున్నా. ప్రభుత్వం స్పందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వస్తున్న ధాన్యాన్ని బార్డర్ చెక్‌పోస్టుల వద్ద అడ్డుకోవాలి. మన రైతులకు మద్దతు ధర అందేలా జిల్లా మంత్రులు చర్యలు చేపట్టాలి.



# మోడీ విదేశీ పర్యటనలో మాట్లాడిన మాటలు నీటి బుడగలు అయ్యాయి

## పెంచిన గ్యాస్ పెట్రోల్ ధరలు వెంటనే తగ్గించాలి

## ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు కామల్ల నవీన్



**గరిడేపల్లి నవభూమి** పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కామన్ల నవీన్ ప్రకటనలో తెలిపారు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను పెంచి పేద ప్రజల పైన భారం మోపుతుందని ఆయన అన్నారు భారతదేశం వెలిగిపోతుంది పేదరికం లేని దేశంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వం మోదీ విదేశీ పర్యటనలో మాట్లాడిన మాటలు నీటి బుడగలాగా అయ్యాయని అన్నారు పెంచిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు పెంచి పేదవారి నడ్డి విరచడమేనా మీరు చెప్పే మాటలు చేసే విధానాలు నీటి మీది బుడగలాగా అయ్యాయని ఆయన అన్నారు నిత్య అవసరవ ధరలు పెరిగి ప్రజలు సతమతమవుతున్నటువంటి పరిస్థితులలో వంటగ్యాసు ధర పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి ప్రజలను ఇంకొంచెం అణిచివేతకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు విదేశీ పెట్టుబడులకు కార్పొరేట్ శక్తులకు బడా బూర్జువా బడా భూస్వామ్య వ్యవస్థకు తలవంచి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజలను అణచివేతకు గురి చేస్తుందని ఆయన అన్నారు కార్మిక వర్గం ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను పట్టించుకోకుండా విదేశీ శక్తులకు విదేశీ పెట్టుబడులకు తలవంచి నిత్యవసర వస్తువుల ధరలు పెంచి కార్మిక వర్గంపై మరింత భారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కార్మిక వర్గం పనులు లేక పొట్ట చేత పట్టుకొని పట్టణాలలకు పరుగులు తీస్తున్నారు అటువంటి పరిస్థితులలో వంట గ్యాస్ ధర పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి కార్మిక వర్గాన్ని మరింత పేదరికం లోకి నెట్టివేయబడుతుందని అన్నారు వెంటనే వంటగ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు

# న్యాయవాదిపై దాడికి నిరసనగా కోర్టుల విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**మిర్యాలగూడ నవభూమి, ఏప్రిల్ 8:-** హైద్రాబాద్ లో న్యాయవాది ముజ్తబాపై జరిగిన దాడి ని ఖండిస్తూ నిరసనగా మంగళవారం కోర్టుల విధులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బహిష్కరించారు, కోర్టు సముదాయం ముందు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో న్యాయవాదులు మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి రామకృష్ణరెడ్డి, ఉపాధ్యక్షులు ఎండి.ఇబ్రహీం, కార్యదర్శి ఎస్.వేలాద్రి, పవన్ కుమార్, గూడూరు శ్రీనివాస్ రావు, నేతి సత్యనారాయణ, లింగంపల్లి శ్రీనివాస్, విజయసారధి, కొంక వెంకన్న, భాస్కర్, డీ.రవి నాయక్, వెంకట్ రెడ్డి ఖండించారు. ఇలాంటీ సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.





# నార్ముల్ చైర్మన్‌పై అవిశ్వాసం




**యాదగిరిగుట్ట, నవభూమి, :** నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్(నార్ముల్) చైర్మన్, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు గూడ మధుసూదన్ రెడ్డిపై ఆవిశ్వాసం తీర్మానం తప్పేలా లేదు. ఆయన తీరును బీఆర్ఎస్ పార్టీతోపాటు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నార్ముల్ డైరెక్టర్లు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.గత 6 నెలలుగా పాడి రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు పెండింగ్‌లో పెట్టడమే కాకుండా నార్మూల్ సంస్థ ఆస్తులు విక్రయించడం, సంస్థ నిధులను సొంతంగా ఖర్చు చేసుకోవడంపై డైరెక్టర్లు గుర్రుమంటున్నట్లు తెలిసింది. వెంటనే ఆయనను తొలగించి నూతన చైర్మన్‌ను ఎన్నుకునేందుకు 11 మంది డైరెక్టర్లు సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని రెడ్డి సత్రంలో రహస్యంగా సమావేశం నిర్వహించారు. ఇందులో 9 మంది డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాగా ఇద్దరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు ఉన్నారు.ఇష్టారాజ్యంగా చైర్మన్ వ్యవహారం తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన గూడ మధుసూదన్‌రెడ్డి గతేడాది అక్టోబర్‌లో నార్ముల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో స్థానిక మంత్రి, ప్రభుత్వ విప్‌తో కలిసి పాడి రైతులపై హామీల వర్షం గుప్పించారు. 270 మంది పాల సంఘం చైర్మన్లతో క్యాంపులు నిర్వహించి వారిని మభ్యపెట్టాడు. తనను గెలిపిస్తే రూ. 5 బోనస్‌తోపాటు ప్రభుత్వ తరపు నుంచి రూ. 30 కోట్ల గ్యాంట్స్ తీసుకువస్తామని, గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లిస్తామని హామీలు ఇచ్చారు.అధికారంలోకి వచ్చిన 6 నెలలు గడుస్తున్నా అమలు మాత్రం నోచుకోలేదు కదా, సంస్థను మూసివేసే పరిస్థితికి తీసుకొచ్చారని పలువురు పాల సంఘం చైర్మన్లు వాపోతున్నారు. ప్రస్తుతం 6 బిల్లులు పెండింగ్ పెట్టి పాడి రైతులకు సుమారుగా రూ. 20 కోట్లు అప్పు పెట్టాడని, సంస్థ అభ్యున్నతిని పక్కన పెట్టి సంస్థ నిధులతో రూ. 1.60 లక్షలతో మొబైల్ ఫోన్ కొనుగోలు చేసి జల్సాలు చేస్తున్నాడని పాడి రైతులు చెబుతున్నారు.పాల సంఘాలతో కాకుండా ఇతర ప్రాంతాల్లో రోజుకు 40 వేల లీటర్ల పాలను అక్రమంగా కొనుగోలు చేసి, ఒక్కో లీటరుకు రూ. 2 కమీషన్‌తో రోజుకు రూ. 80 వేలు తన జేబులో వేసుకుంటున్నాడని రైతులు చర్చించుకుంటున్నారు. ఇందులో భాగంగానే 6 బిల్లులు పెండింగ్‌లో పడినట్లు అనుమానిస్తున్నారు. అంతటితో ఆగక సంస్థకు చెందిన చిట్యాలలో 32 ఎకరాలు, మిర్యాలగూడలో 1.20 ఎకరాల భూమి దాదాపుగా రూ. 75 కోట్లు ఆస్తులను విక్రయించేందుకు పాలక మండలితో తీర్మానం సైతం చేశారు.కాగా విక్రయాలను అడ్డుకునేందుకు మాజీ చైర్మన్ కోర్టును ఆశ్రయించారు. సంస్థను గాడిలో పెట్టే చైర్మన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై విసుగు చెందిన నార్ముల్ డైరెక్టర్లు, పాల సంఘం చైర్మన్లు ఆయనను పదవి నుంచి దింపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రామన్నపేట మండలంలోని నిదాన్‌పల్లికి చెందిన డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లికి చెందిన మరో డైరెక్టర్ కళ్లెపల్లి శ్రీశైలం చైర్మన్ రేసులో ఉన్నట్లు తెలుస్తున్నది.పాలకవర్గం రద్దుకు 270 మంది సంఘం చైర్మన్ల మొగ్గు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, నార్ముల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డితోపాటు ముగ్గురు మాజీ డైరెక్టర్లు ఒగ్గు భిక్షపతి, కాయితి వెంకట్‌రెడ్డి, మోతె సోమిరెడ్డి కలిసి జిల్లాకు చెందిన 30 మంది పాల సంఘం చైర్మన్లతో రహస్యంగా సమావేశమయ్యారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాకు చెందిన 270 మంది చైర్మన్లు పాలకవర్గాన్ని రద్దు చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. సంస్థ మూత పడకముందే సమర్థవంతుడైన నాయకుడికి చైర్మన్‌గా నియమిస్తే రైతులకు పాల బిల్లు అందడంతో పాటు సంస్థను లాభాల బాటలో నడిపించవచ్చునన్న నిర్ణయానికి వచ్చిన్నట్లు ఓ మాజీ డైరెక్టర్ వివరించారు.11 మంది డైరెక్టర్లు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వద్ద వెళ్లి సమస్యను విన్నవించారని, పరిష్కరించేందుకు ఎమ్మెల్యే గడువు కోరినట్లు నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు పాడి రైతులకు న్యాయం జరుగకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. సొంత పార్టీకి చెందిన డైరెక్టర్లు వ్యతిరేకంగా ఉండటంతో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వారికి సర్ది చెప్పేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

# రజతోత్సవ సభకు కదం తొక్కుదాం

**నకిరేకల్, నవభూమి, :** కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ రజతత్సోవ సభను అడ్డుకునేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్-30 అమల్లోకి తీసుకువచ్చారని, ఎన్ని ఆంక్షలు విధించినా సభకు గులాబీ దళంతో కదం తొక్కుతామని, ఆంక్షలను వెంటనే వెనక్కి తీసుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు.ఏప్రిల్ 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో లక్షలాది మందితో నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ పోస్టర్‌ను సోమవారం నకిరేకల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓ వైపు పార్టీ సమావేశాలు, మరో వైపు ప్రభుత్వ కార్యక్రమాలకు అనుమతి ఉండొచ్చు కానీ, బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు మాత్రం అనుమతి ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు.బీఆర్ఎస్ రజతోత్సవ సభను అడ్డుకునేందుకు నెలరోజుల పాటు ర్యాలీలు, సభలు, ఊరేగింపులను నిషేధిస్తున్నట్లు వరంగల్ సీపీ ఉత్తర్వులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో లాఠీదెబ్బలు తినని రంగమేదైనా ఉన్నదా?అని, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తల, న్యాయం కోసం ప్రశ్నించిన ప్రతి సామాన్యుడిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసులు పెడుతుందని విమర్శించారు.ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై సందర్భం లేకుండా కేసులు పెట్టి కక్ష సాధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు మహాసభ విజయవంతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ మాదధనలక్ష్మీనగేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, బీఆర్ఎస్ నకిరేకల్, కేతేపల్లి మండలాల అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిల్వేరు ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ రాచకొండ వెంకట్‌గౌడ్, నాయకులు సోమ యాదగిరి, పెండెం సదానందం, సామ శ్రీనివాస్‌రెడ్డి, గొర్ల వీరయ్య, యానాల లింగారెడ్డి, కట్ట శ్రవణ్, రాచకొండ శ్రవణ్, జంగయ్య, కౌన్సిలర్ పల్లె విజయ్, తదితరులు పాల్గొన్నారు.



# రూ.6లక్షల లెక్కలు చూపని ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షులు రమాపై చర్యలు తీసుకోవాలి

## కమిషనర్ యూసుఫ్‌ను కోరిన ఎస్ఎల్ఎఫ్ సభ్యులు



**మిర్యాలగూడ నవభూమి, ఏప్రిల్ 8:-** మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ 32వార్డులోని స్లం లెవెల్ ఫెడరేషన్ (ఎస్ఎల్ఎఫ్) అధ్యక్షులు కె. రమా సభ్యుల 6లక్షల రూపాయల దుర్వినియోగం చేసినట్టు సభ్యులు సుమారు 50 మంది మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్ కు ఫిర్యాదు చేశారు. ఎస్ఎల్ఎఫ్ లో సుమారు 17 స్వయం సహాయక సంఘాలున్నాయని వారు పేర్కొన్నారు. పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎస్ఎల్ఎఫ్ ఖాతా ప్రారంభించారని వారు తెలిపారు. 4 సంవత్సరాలుగా సంఘాల సభ్యులు సుమారు 6 లక్షల రూపాయలు పొదుపు చేసి ఇవ్వగా బ్యాంకు రుణాల కోసం బ్యాంకు రమ్మంటే ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షులు రమా రావడం లేదని, లెక్కలు చూపడం లేదని ఆరోపించారు. 17 సంఘాల సమావేశం ఏర్పాటు చేసి రమన్న రాలేదని పైగా దూషించిందని వారు పేర్కొన్నారు. అలగా జనంతో మాట్లాడను అంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. సభ్యుల పొదుపు సొమ్ము 6లక్షల రూపాయలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మెప్మా టీఎంసి పి. బక్కయ్యను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో షరీఫా, సల్మా, ఆసియా, నసీమా, చాంద్ సుల్తానా, ఆశాలున్నారు.

# బస్సు.. లారీ ఢీ తృటిలో తప్పిన ప్రమాదం

**పెన్ పహాడ్, ప్రతినిధి ఏప్రిల్ 8(నవభూమి)** పెన్పాహాడ్ మండల కేంద్రంలోని ప్రైవేట్ బస్సు, లారీ ఢీ ప్రయాణికులకు త్రుటిలో తప్పిన ప్రాణాపాయం. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండల కేంద్రంలోని మూల మలుపుల వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ నుండి సూర్యాపేటకు వెళ్తున్న లారీ, సూర్యాపేట నుండి పెన్ పహాడ్ వైపు వస్తున్న ప్రైవేటు బస్సు పెన్ పహాడ్ గ్రామంలోని మూలమలుపుల వద్ద లారీ బస్సు ఎదురు ఎదురుగా గా వచ్చి లారీ బస్సు కి పక్క సైడ్ తగిలి బస్సు వెనుక భాగం డ్యామేజ్ అయింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్ని దేహశుద్ధి చేసిన బస్సు డ్రైవర్. సంఘటన స్థలంలో భారీగా స్తంభించిన రాకపోకలు పోలీసుల రంగ ప్రవేశంతో ట్రాఫిక్ ని క్లియర్ చేసి లారీని బస్సు ని పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఇట్టి సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాస్తాల గోపికృష్ణ తెలిపారు.



# సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట సహపంక్తి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ త్రిపాఠి





**మిర్యాలగూడ నవభూమి ఏప్రిల్ 8:-** మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో మంగళవారం సన్న బియ్యం లబ్ధిదారుడు ఇంట్లో వారి కుటుంబం వండిన సన్న బియ్యంతో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ, మిర్యాలగూడ సబ్-కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ సహపంక్తి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో ముచ్చటించి సన్న బియ్యం ఎలా ఉన్నాయి అడిగి తెలుసుకున్నారు. భోజనం అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. సన్న బియ్యం సక్రమంగా అందించాలని అధికారులు, ఉద్యోగులు, చౌకధరల దుకాణదారులను కోరారు.కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నాగేశ్వరరావు, మాడ్గులపల్లి మండలం తహసీల్దార్ సురేశ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

**భువనగిరి నవభూమి, :** భువనగిరి మండల వ్యాప్తంగా ఉన్న భూ పంపిణీపై నిషేధం ఎత్తివేసి పేద రైతులకు వ్యవసాయ భూములు, పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు, దళితులు, గిరిజనులు తదితర వర్గాల ప్రజలకు భూములను పంపిణీ చేసి, వారి ఆర్థిక పరిపుష్టికి పాలకులు చొరవ చూపాలన్నారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో 331 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు సాగు భూమి, ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే విధంగా చొరవ చూపాలన్నారు. లేనట్లయితే సీపీఎం ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు పాతి పేదలకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నాయకులు అశోక్, నాగమణి, కూకుట్ల కృష్ణ, లక్ష్మయ్య, మల్లయ్య ఉన్నారు.



# పాఠశాల ముందు సీసీ రోడ్డు నిర్మించాలని విద్యార్థుల ఆందోళన



**గట్టుప్పల్, నవభూమి, :** పాఠశాల ముందు సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం పాఠశాల గేటు ముందు ఆందోళన నిర్వహించారు. వర్షం పడితే స్కూల్ లోపలికి వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవ తీసుకుని వెంటనే పాఠశాల ముందు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక రాజకీయ నాయకులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

# ఎన్జీ కళాశాల మైదానంలో డ్రైనేజీ నిర్మాణం నిలిపివేయాలి : కట్టా శ్రీనివాస్

**నల్లగొండ నవభూమి, : :** నల్లగొండ జిల్లాకే తలమానికమైన ఉన్నత విద్యా నిలయం, జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల(ఎన్జీ) మైదానంలో చుట్టుపక్కల కాలనీ నుంచి వచ్చే మురుగునీటి పారుదల కోసం డ్రైనేజీ కాల్వ నిర్మించడాన్ని తక్షణమే నిలిపియేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కట్ట శ్రీను మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా కళాశాల మైదానం ఆక్రమణకు గురైతుందన్నారు. దానికి తోడు చుట్టుపక్కల కాలనీల మురుగు నీరు కోసం కాలేజీ వాకింగ్ ట్రాక్ పక్కనే డ్రైనేజీ నిర్మిస్తుండడం సరైంది కాదన్నారు. తక్షణమే పనులను ఆపివేసి కళాశాల మైదానంలో నుంచి కాకుండా వేరే వైపు నుంచి నిర్మాణం చేపట్టాలన్నారు.డ్రైనేజీ భవిష్యత్‌లో పొంగినట్లయితే కళాశాల క్రీడా ప్రాంగణం మురుగుమయమైతుందని, దీనివల్ల ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. కొంతమంది నాయకులు, మున్సిపాలిటీ అధికారులు కళాశాల మైదానాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మున్సిపల్ అధికారులు కళాశాల భూమి విషయంలో అతిగా జోక్యం చేసుకుని ప్రిన్సిపల్ అధికారానికి అడ్డుపడుతున్నారని ఈ చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్వీ నల్లగొండ పట్టణాధ్యక్షుడు అంబటి ప్రణీత్, బీఆర్ఎస్వీ నకిరేకల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు జెట్టి శివప్రసాద్, టీఎస్ జేఏసి రాష్ట్ర కన్వీనర్ కత్తుల వంశీ ఉన్నారు.

